నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
13 హైదరాబాద్, శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 HYDERABAD



## మహిళా సాధికారతతోనే బలమైన ఆర్థిక వ్యవస్థ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ) : మహిళా సాధికారతతోనే బలమైన ఆర్థిక వ్యవస్థ సాధ్యమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి అన్నారు. గురువారం యూఎస్ కాన్సులేట్, వీకనెక్ట్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా సాధికారతపై జరిగిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. మహిళ వ్యాపారవేత్తలతో పాటు వీకనెక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, వీకనెక్ట్ ఇంటర్నేషనల్ సీఈవో వాజిక్వీజ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

## దశావతారం..



గురువారం రవీంద్రభారతిలో ఆంధ్ర బాలానంద సంఘం ఆధ్వర్యంలో జరిగిన దశావతారాలు నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నది.

# బస్సులు రాక.. నిలబడలేక..

### తక్కువ సర్వీసులతో నగరవాసులకు ఇక్కట్లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : 'బస్సు ఎప్పుడొస్తుంది? వచ్చినా కనీసం నిల్చొనే స్థలమైనా ఉంటుందా? గంటలు గడిచినా బస్సు రావడం లేదాయే? ఈ ఎండలో పడిగాపులు మా వల్ల కావడం లేదు. కాలేజీలు, కార్యాలయాలు, ఆసుపత్రులు వెళుదామంటే..గంటల సమయం వృథా అవుతుంది.' ఇది బస్టాపులో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికుల ఆవేదన. సమయానికి బస్సులు రావడం పక్కనపెడితే.. అసలు గంట ఆలస్యమైనా బస్సు రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్‌లో ప్రతి రోజూ సుమారు 20 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిని గమ్యస్థానాలకు చేర్చడానికి మొత్తం 2640 బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు 25 వేల నుంచి 30వేల ట్రిప్పులు నడుస్తుంటాయి. ఈ బస్సులు సరిపోవడం లేదని బస్సుల సంఖ్య పెంచాలని అధికారులు ప్రభుత్వానికి రిపోర్ట్ కూడా పంపించారు. ఇలాంటి పరిస్థితులతో ఆర్టీసీ సతమతమవుతుంటే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కొత్త బస్సులు సమకూర్చకుండా.. గ్రేటర్‌లో ఉన్న అరకొర బస్సుల్లో 1800 సర్వీసులను మేడారం జాతరకు తరలించింది. దీంతో మిగలిన బస్సులు 840 మాత్రమే. వీటితో గ్రేటర్‌లో లక్షల మంది రాకపోకలు సాధ్యమవుతాయా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.



#### ఆటోలే దిక్కాయే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే ఆటోవాలాల ఉపాధిపై దెబ్బ వేసింది. మహిళలకు ఉచిత బస్సు స్కీం ప్రవేశపెట్టి ఆటో డ్రైవర్లను రోడ్డు పాలుజేసింది. ఆటోల అవసరమే లేదన్నట్టుగా ప్రభుత్వం వారి ఆత్మహత్యలను సైతం పట్టించుకోవడం లేదు. మరోవైపు ఆటోడ్రైవర్లు నిరసనలు, బంద్‌లు చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. ఇదిలా ఉండగా ఇప్పుడు గ్రేటర్‌లో బస్సుల సంఖ్య తగ్గడంతో ప్రయాణికులు ఆటోల వైపు చూస్తున్నారు. బస్సులు రాకపోవడంతో ఆటోల్లోనే తమతమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

#### ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి

గతంలో సగటున 20 నిమిషాలకు వచ్చే ఆర్టీసీ బస్సు గంట దాటినా రావడంలేదు. గంటపాటు బస్టాండ్‌లో వేచి ఉండాల్సి వస్తున్నది. ప్రభుత్వం స్పందించి నగరంతో పాటు శివారు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతున్నా.

– పంగ కార్తిక్, ప్రైవేట్ ఉద్యోగి, హయత్‌నగర్





#### మాకు బస్సులే దిక్కు

మేం బస్సులపైనే ఆధారపడి ప్రయాణిస్తుంటాం. ఈ ఎండలో నాలాంటి వారు ఎంతసేపు నిల్చోగలరు. పోనీ ఏదైన బస్సు వస్తే ఎక్కుదామనుకుంటే బస్టాపులో బస్సులు ఆపడం లేదు. దూరాన ఆపుతున్నారు. నాలాంటి వృద్ధులు అంతదూరం వెళ్లి బస్సు ఎలా ఎక్కుతారు? మరో బస్సు వస్తే అందులో నిల్చొనే స్థలం కూడా లేదు. ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరం. బస్సుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది.

– స్వామి



# సొరంగం.. సాధ్యమేనా..?

- అసాధ్యమని గతంలోనే తేల్చిన నిపుణుల కమిటీ
- తాజాగా ఐదు చోట్ల ప్రతిపాదనలపై.. మళ్లీ అధ్యయనం
- కిలోమీటర్‌కు వెయ్యి కోట్ల వరకు ఖర్చు
- సాంకేతికంగా పెను సవాలు

*మహానగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సొరంగ మార్గాల వైపు వేస్తున్న అడుగులు ముందుకు సాగేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే..ఆర్థికంగా అంతకంటే తక్కువ ప్రత్యామ్నాయాలు ఉండటం ఒక వంతైతే... చారిత్రక నగరంలో సాంకేతికంగా పెను సవాళ్లతో కూడుకున్న ఈ నిర్మాణాలను చేపట్టడం ఎంత వరకు శ్రేయస్కరం అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే తెరపైకి వచ్చిన ఈ ప్రతిపాదనలపై అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ కేవలం ఆరున్నర కిలోమీటర్ల మేర నిర్మాణాలే సాధ్యం కాదని తేల్చింది. ఈ నేపథ్యంలో ఏకంగా ఐదు చోట్ల.. అందునా అత్యంత రద్దీగా ఉండే నగరం నడిబొడ్డున 39 కిలోమీటర్ల మేర సొరంగ మార్గాలు ఎలా సాధ్యమవుతాయనే ప్రశ్నలు అధికార యంత్రాంగం నుంచే వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన కావడంతో అధ్యయనం చేయాలి మరోసారి... అంటూ కన్సల్టెన్సీ ఎంపికపై ముందుకు సాగుతున్నారు.*

**- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ)**

మహా నగరాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికిగాను సొరంగ మార్గాలు (టన్నెల్ రోడ్స్) నిర్మించడం సాధారణమే. కాకపోతే ముందుగా రవాణా వ్యవస్థలో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, తదితర నిర్మాణాలను చేపడతారు. సమస్య పరిష్కారం కాకపోతే మెట్రో, బీఆర్‌టీఎస్ ఇలా అనేక రకాల ప్రజా రవాణా వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. ఇవన్నీ సాధ్యం కాకపోతే తప్పని పరిస్థితుల్లో సొరంగ మార్గాలను ఆశ్రయిస్తారని రవాణా వ్యవస్థ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు దేశ రాజధానిలో రెండు కిలోమీటర్ల లోపు సొరంగ మార్గం మినహా మరెక్కడా ఇలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ప్రస్తుతం సొరంగ మార్గాల నిర్మాణంలో అనుసరించే అత్యాధునిక టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో సుమారు కిలోమీటరు నిర్మాణానికి దాదాపు రూ. వెయ్యి కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ క్రమంలో బెంగళూరులో ఎన్‌హెచ్ఏఐ 60 కిలోమీటర్లకు రూ. 50వేల కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేసింది. అంటే సొరంగ మార్గాలు అనేవి ఆర్థికంగా భారీ వ్యయంతో కూడుకున్నవిగా అర్థమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా మహా నగరాలు ఎక్కువగా అనుసరిస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టుల్లో కిలోమీటరుకు రూ. 200 కోట్ల లోపే ఖర్చవుతున్నది. అందుకే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మహా నగరాలు ఎక్కువగా మెట్రో వైపే మొగ్గు చూపుతున్నాయి.

#### సాంకేతికంగా ఎంతో సంక్లిష్టం..

మెట్రో రైలు ప్రాజెక్టుల కోసం చేపట్టే సొరంగ నిర్మాణాల డయా 5.5 నుంచి ఏడు మీటర్ల వరకు ఉంటుంది. రహదారుల కోసం నిర్మించే సొరంగ మార్గాలు మాత్రం వీటి కంటే ఎక్కువగా కనీసంగా ఏడు మీటర్ల డయా ఉంటుంది. సాగునీటి ప్రాజెక్టుల్లో చేపట్టే సొరంగ మార్గాల డయా భారీగా ఉంటుంది. శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ ప్రాజెక్టు (ఎస్సెల్బీసీ)లో 11 మీటర్లు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 13 మీటర్ల డయాతో సొరంగాలు నిర్మించారు. అయితే సాగునీటి ప్రాజెక్టులంటే అటవీ, మైదాన ప్రాంతాల్లో ఉంటున్నందున సాంకేతికంగా పెద్ద సమస్య ఉండదు. అయితే మహా నగరాల్లో నివాసాలు, ట్రాఫిక్ ఉండే ప్రాంతాల్లో సొరంగ నిర్మాణాలు చేపడతే మాత్రం..సాంకేతికంగా అవి పెను సవాలుతో కూడుకుంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

#### గత అనుభవాలు ఇవి..

» నగరంలోని లిబర్టీ నుంచి నింబోలిఅడ్డా వరకు డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంలో భాగంగా 1.8 మీటర్ల డయాతో 5 కిలోమీటర్ల మేర సొరంగాన్ని చేపట్టారు. అప్పుడున్న అత్యాధునిక పరిజ్ఞానం ట్రెంచ్‌లెస్ టెక్నాలజీతో 2008లో అప్పటి సీఎం వైఎస్ శంకుస్థాపన చేశారు. 2009 జూలైలో పనులు మొదలైతే.. 2022 వరకు కేవలం నాలుగు కిలోమీటర్లు మాత్రమే పూర్తి చేయగలిగారు. పైగా సంవత్సరాల తరబడి వాహనదారులు ట్రాఫిక్ నరకం అనుభవించారు. దీంతో అయినంత వరకు చాలనుకొని ఆ ప్రాజెక్టును అక్కడితో ముగించారు.

» కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కేబీఆర్ పార్కు వద్ద సొరంగ జంక్షన్ ఏర్పాటు చేసి... జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45 నుంచి జంక్షన్ వరకు (1.7 కిలోమీటర్లు), బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుంచి జంక్షన్ వరకు (1.1 కిలోమీటరు), జంక్షన్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ వరకు జంక్షన్ వరకు (2 కిలోమీటర్లు) ఇలా 6.3 కిలోమీటర్ల ప్రతిపాదనలపై సాధ్యాసాధ్యాలను తేల్చేందుకు కన్సల్టెన్సీకి ఇచ్చారు. నిపుణుల కమిటీ అధ్యయనం చేసి చివరకు నగరంలో సొరంగ మార్గం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. దీంతో ఈ ప్రతిపాదనతో పాటు ఐటీసీ కోహినూరు నుంచి రాయదుర్గం చౌరస్తా వరకు ఉన్న మరో ప్రతిపాదనను కూడా ప్రభుత్వం విరమించుకున్నది.

#### ఏడు మీటర్ల డయాతో..

ఏడు మీటర్ల డయాతో రహదారుల కోసం నిర్మించిన సొరంగం పైభాగం నుంచి భూ ఉపరితలం వరకు 14 మీటర్ల దూరం ఉండాలి. అంటే కనీసం భూమి లోపల 21 మీటర్ల (69 ఫీట్లు) లోతు వరకు వెళ్లాలి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కేబీఆర్ పార్కు వద్ద ప్రతిపాదించిన సొరంగ మార్గం కోసం ఏకంగా వంద మీటర్ల వరకు వెళ్లాలని నిపుణులు సూచించారు. దీని ప్రకారం ఆయా ప్రదేశాల్లో నేల స్వభావాన్ని బట్టి లోతు నిర్ధారిస్తారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఈవోఐ టెండర్లు పిలిచిన జాబితాలో కీలకమైన హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ మీదుగా మూసీని దాటుకొని పాతబస్తీ వరకు సొరంగ మార్గాలు ప్రతిపాదించారు. ఇలాంటి చోట్ల భూమి లోపల 70-100 ఫీట్ల వరకు వెళ్లి తవ్వుకుంటూ పోవాలంటే సాంకేతికంగా ఎంత సంక్లిష్టమో అర్థం చేసుకోవచ్చు.

#### అతిపెద్ద సవాల్..

మైదాన, గ్రామీణ ప్రాంతాల్లో సొరంగ మార్గానికి రెండు వైపులా కొంత దూరంలో రెండువైపులా ఆడిట్ టన్నెల్స్ నిర్మిస్తారు. అంటే మనుషుల రాకపోకలు, యంత్రం వెళ్లడం, మట్టి, రాళ్లను తరలించేందుకు టిప్పర్ల రాకపోకల కోసం వీటిని నిర్మిస్తారు. నగరంలో ఆరు కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణానికి నాలుగు చోట్ల ఆడిట్ టన్నెల్స్ నిర్మించాలి. మరి నగరంలోని ఇంత ట్రాఫిక్, ఇరుకైన రహదారుల్లో ఇవి సాధ్యమా అనేది జవాబు లేని ప్రశ్నే.

# పంజాగుట్ట ఠాణా నుంచి దొంగ పరార్

సిటీబ్యూరో/ఖైరతాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : సంచలనాలకు కేంద్రంగా మారిన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో తరచూ అనూహ్య ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దొంగలు ఈజీగా పంజాగుట్ట పోలీసుల కండ్లు గప్పి పరారవుతున్నారు. గత నెలలో ఒక దొంగ పరారైన ఘటన మరువకముందే తాజాగా ఠాణాలో నుంచి కస్టడీలో ఉన్న మరో అనుమానితుడు పరారు కావడం ఇప్పుడు సంచలనంగా మారింది. నిమ్స్ దవాఖానలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్కడ గురువారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండడంతో దొంగగా అనుమానించి స్థానికులు పోలీసులకు పట్టించారు. అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులు వివరాలు సేకరించడంతో సికింద్రాబాద్‌కు చెందిన టిల్లుగా తేలింది. ఇతడిపై గతంలోనూ దొంగతనం కేసులున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే అతడిని మరింత విచారించి.. ఇటీవల జరిగిన దొంగతనం కేసుల గురించి.. వాకబు చేయాలని పోలీసులు భావించారు. పోలీస్‌స్టేషన్ పై అంతస్తులోని క్రైమ్ రూమ్‌కు తరలించారు. ఉదయం 5.30 గంటల ప్రాంతంలో వాష్ రూమ్‌కు వెళ్లొస్తానని చెప్పిన టిల్లు.. పోలీసుల కండ్లు కప్పి పోలీస్‌స్టేషన్ పైకప్పు నుంచి పక్కకు దూకి అక్కడి నుంచి పరారయ్యాడు. వాష్‌రూమ్‌కు వెళ్లిన టిల్లు తిరిగి రాకపోవడంతో ఠాణాలో ఉన్న పోలీసులు అతడి కోసం అన్ని చోట్ల వెతికారు. అప్పటికే టిల్లు పోలీస్ స్టేషన్ ఆవరణ నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో ప్రత్యేక బృందాలు టిల్లును పట్టుకోవడానికి రంగంలోకి దిగాయని పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ తెలిపారు.



#### నిర్లక్ష్యం... అవినీతి

పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మాజీ ఎమ్మెల్యే కొడుకు చేసిన ర్యాష్ డ్రైవింగ్ కేసును బోల్తా కొట్టించేందుకు స్వయంగా స్టేషన్ ఎస్‌హెచ్‌వో రంగంలోకి దిగడం ఆ తరువాత అరెస్ట్, సస్పెన్షన్ వ్యవహారాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించాయి. అదే సమయంలో పంజాగుట్ట ఠాణాకు చెందిన సిబ్బంది కస్టడీలో నుంచి ఓ నిందితుడు పరారయ్యాడు. పోలీసుల నిర్లక్ష్యం, అవినీతి వ్యవహారాలపై ఆరా తీసిన నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి..ఒకే సారి 85 సిబ్బందిని పంజాగుట్ట ఠాణా నుంచి కార్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఇంత కఠినంగా వ్యవహరించినా తిరిగి పోలీసులు నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. తాజాగా దొంగ పరారైన ఘటనపై నగర పోలీస్ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## ఇయర్ ఫోన్స్ పెట్టుకొని పట్టాల వెంట నడుస్తూ..

కాచిగూడ: ఓ వ్యక్తి చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకొని.. పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా, రైలు ఢీకొట్టడంతో చనిపోయాడు. కాచిగూడ హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈదీబజార్‌లోని మహ్మద్‌నగర్‌కు చెందిన మహ్మద్ రఫీక్ (43) బుధవారం రాత్రి యాకత్‌పుర-ఉప్పుగూడ రైల్వేస్టేషన్ల మధ్య ఇయర్ ఫోన్స్ పెట్టుకొని..పట్టాల వెంట వెళ్తుండగా..రైలు ఢీకొట్టడంతో చనిపోయాడు.

## ఆరేండ్ల చిన్నారిపై లైంగికదాడి

బంజారాహిల్స్: ఆరేండ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఫిలింనగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో నివాసముంటున్న బాలిక (6) ఒకటో తరగతి చదువుతున్నది. ఇటీవల బాలిక తల్లి శస్త్ర చికిత్స కోసం ఆస్పత్రిలో చేరింది. దీంతో బాలికను పెదనాన్న ఇంట్లో ఉంచారు. రెండ్రోజుల కిందట ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తల్లి ఇంటికి వచ్చింది. బాలిక తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న విషయాన్ని గమనించి ప్రశ్నించగా, పెదనాన్న కొడుకు(20) తనకు చాక్లెట్ ఇచ్చి.. లైంగికదాడికి పాల్పడ్డాడని చెప్పింది. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆహార కల్తీకి చెక్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ):ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులపై కఠినంగా వ్యవహరించేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫుడ్ సెక్యూరిటీ అధికారులను సంబంధిత జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో రోజు వారీ బాధ్యతలు నిర్వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రచారం దండి.. ఖజానాకు గండి..!

### యాడ్ ఏజెన్సీలపై నియంత్రణ కోల్పోయిన బల్దియా

సిటీబ్యూరో: ప్రచారం దండి.. ఖజానాకు గండి అన్నట్లు..అక్రమంగా ఏర్పాటైన హోర్డింగులతో.. జీహెచ్ఎంసీ ఖజానాకు జరుగుతున్న నష్టానికి లెక్కేలేదు. కేబీఆర్ పార్కు చుట్టూ , ప్రధాన రహదారి సెంట్రల్ మీడియన్‌లో లాల్‌పాప్స్ (ప్రకటనల బోర్డులు) దర్శనమిస్తాయి. రికార్డుల కంటే అత్యధికంగా అనధికారికంగా ఉంటాయన్నది ప్రధాన ఆరోపణ. ఈవీడీఎంలో ఇటీవల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారి నెలకు రూ. 5 లక్షల మేర ముడుపులు సదరు ఏజెన్సీ నుంచి అందుతున్నాయన్నది బలంగా వినిపిస్తున్న ఆరోపణ. హోర్డింగ్ పాలసీలో భాగంగా నగరంలో ఎక్కడైనా 15 మీటర్ల కంటే ఎత్తు ఉన్న హోర్డింగ్‌లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. 15 మీటర్ల వరకు ఉన్న హోర్డింగ్‌లు సైతం పక్కాగా నిబంధనల ప్రకారం నడపాలి. సదరు ఏజెన్సీలు మెట్రో పిల్లర్లే లక్ష్యంగా అర్ధరాత్రి వేళ..హోర్డింగ్‌ల ఏర్పాటులో నిబంధనలు పాటించడం లేదు. ఈ తరహా సర్దార్ పటేల్ రోడ్ (శివాజీనగర్), సైబర్ సిటీ టవర్, శిల్పారామం రోడ్ ఇలా కొన్ని చోట్ల అర్ధరాత్రి పూట వయా డక్ట్ హోర్డింగ్ పనులు జరుపుతున్నారు. ఈ పనులను పర్యవేక్షించే అధికారులు లేరు. ప్రమాదకర స్థాయిలో ఈ పనులు జరుగుతున్నాయన్నది ఆరోపణ. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో కొన్ని సంవత్సరాల కిందటే భారీ హోర్డింగ్‌ను తొలగించారు. అయితే తాజాగా పీటీఐ నంబర్ 1100630829తో దాదాపు రూ. 10 లక్షలకు పైగా హోర్డింగ్ ట్యాక్స్ వేశారు. హోర్డింగ్‌తో ఉన్న ఆదాయాన్ని కోల్పోయిన ప్రెస్‌క్లబ్‌కు అధికారులు.. కొత్తగా జారీ చేసిన ఆస్తిపన్ను రశీదు చూసి కంగుతిన్నారు. మొత్తం ఉదంతాల్లో అధికారుల అవినీతి, అక్రమాలు, పనితీరు ఏవిధంగా ఉన్నదో అర్థమవుతున్నది.

#### పొంతన ఉండటం లేదు..

యూనిపోల్స్, లాలీపాప్స్, హోర్డింగు ఇలా అనేక ఉన్న ప్రాంతాలు అధికారుల రికార్డులు లెక్కలకు , క్షేత్రస్థాయిలో ఉన్న వాటికి ఎక్కడ పొంతన ఉండటం లేదన్నది ఇటీవల వస్తున్న బలమైన ఆరోపణలు .ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీకి రావాల్సిన అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ రూ. 500 కోట్లను కొందరు అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని, అక్రమ హోర్డింగ్స్‌లు, మాల్స్‌లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసిన వారు 'కార్తిక్' ట్యాక్స్ చెల్లిస్తున్నారని ఇటీవల జరిగిన కౌన్సిల్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, బీజేపీ కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రకటనల రూపంలో వందల కోట్లు రావాల్సిన చోట కేవలం రూ.20కోట్లు మాత్రమే వస్తుండడం పట్ల కార్పొరేటర్లు తీవ్రంగా తప్పుపట్టారు. తక్షణమే సభ్యుల డిమాండ్ మేరకు మేయర్ ప్రకటనల విభాగంలో జరుగుతున్న అక్రమాల నిగ్గు తేల్చేందుకు హౌస్ కమిటీని ఏర్పాటు చేస్తూ తీర్మానం చేశారు.

## నాకు పెండ్లయ్యింది.. వెంటపడకు..

**ప్రేమ పేరుతో వెంటపడుతున్న విద్యార్థినికి గురువు హితవు**

- చదువుపై దృష్టి పెట్టి.. లక్ష్యాన్ని సాధించాలని సూచన
- మాస్టర్‌పై కక్ష పెంచుకున్న విద్యార్థిని
- మార్ఫింగ్‌తో కుటుంబసభ్యుల అశ్లీల చిత్రాలు
- సోషల్ మీడియాలో సర్క్యులేట్
- అనంతపూర్‌లో నిందితురాలి అరెస్టు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): 'నాకు పెండ్లయ్యింది... ప్రేమ అంటూ వెంట పడకుండా .. చదువుపై దృష్టి పెట్టి లక్ష్యాన్ని సాధించు' అని సూచించిన గురువుపై కక్ష్య పెంచుకున్న ఓ విద్యార్థిని.. అతడి కుటుంబసభ్యుల అశ్లీల చిత్రాలను రూపొందించి.. సోషల్‌మీడియాలో సర్క్యులేట్ చేసింది. బిచ్చగాడి పేరుపై సిమ్‌కార్డు కొనుగోలు చేసి.. ఎవరికీ దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంది. చివరికి కటకటాలపాలైంది. నగర జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం.. అనంతపూర్‌కు చెందిన యువతి గ్రూప్-1 కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వచ్చి ఓ ప్రైవేట్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నది. అందులో ఒక ఫ్యాకల్టీకి ప్రేమిస్తున్నానంటూ.. తన మనసులోని మాట చెప్పింది. తనకు పెండ్లయ్యిందని.. ఇద్దరు పిల్లలు ఉన్నారని.. అతడు ఆమె ప్రేమను తిరస్కరించాడు. చదువుకోమంటూ.. మందలించాడు. లక్ష్యాన్ని పక్కన పెట్టి.. ఏం చేద్దామనుకుంటున్నావంటూ.. మంచి మాటలు చెప్పాడు. ఇది అవమానకరంగా భావించిన సదరు యువతి.. అతడి పరువు తీయాలని పన్నాగం పన్నింది. అనంతపూర్‌లో యాచకుడికి రూ. 500 ఇచ్చి అతడి పేరు మీద సిమ్‌కార్డు కొనుగోలు చేసింది. ఆ సిమ్‌ను ఉపయోగించేందుకు ఒక సెకెండ్ హ్యాండ్ ఫోన్ కొనుగోలు చేసింది. ఫ్యాకల్టీ కుటుంబ సభ్యుల ప్రొఫైల్‌ను ఇన్‌స్టాగ్రామ్ నుంచి సేకరించింది. ఆ చిత్రాలను అసభ్యకరమైన రీతిలో మార్ఫింగ్ చేసి.. సోషల్‌మీడియా, కోచింగ్ సెంటర్ విద్యార్థులకు షేర్ చేసింది. విషయం తెలుసుకున్న ఫ్యాకల్టీ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఏసీపీ చాంద్‌పాషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ సైదులు బృందం దర్యాప్తు జరిపింది. నిందితురాలు గ్రూప్-1 కోచింగ్ తీసుకుంటున్న అనంతపూర్‌కు చెందిన యువతిగా గుర్తించి అరెస్ట్ చేశారు.